వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు ప్రధానంగా 'ఇందిరమ్మ రాజ్యం' తీసుకువస్తామని చెప్తున్నారు. వారి ఉపన్యాసాలు విన్నప్పుడల్లా ఆనాటి ఇందిరమ్మ రాజ్యం గుర్తుకువస్తున్నది. నేటి తరానికి ఇందిరమ్మ రాజ్యం గురించి తెలియకపోవచ్చు. కానీ, యాభై ఏండ్ల వయస్సు దాటిన వారందరికీ 'ఇందిరమ్మ రాజ్యం' బాగా తెలుసు.

ఇందిరమ్మ రాజ్యం అంటే.. ఆకలి రాజ్యమే!

బుద్ధా మురళి

ఆహారధాన్యాలకు కూడా అమెరికా వైపు ఆశగా చూసిన ఆకలి రాజ్యం రోజులవి. ఈ తరానికి తెలియకపోవచ్చు కానీ, పీఎల్-170 స్కీమ్ కింద అమెరికా ఉచితంగా ఇచ్చే గోధుమలు, పాల పౌడర్ కోసం దేశం ఆశగా ఎదురుచూసిన రోజులవి. ఇప్పుడు ఆహారధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో నంబర్ వన్‌గా నిలిచింది. మొత్తం దేశం ఆకలి తీర్చేస్థాయిలో ఉన్న తెలంగాణలో ఆకలి కోసం విదేశాలు దానంగా ఇచ్చే ఆహారధాన్యాల కోసం ఎదురుచూసిన రోజులను తీసుకువస్తామన్నట్టు ఇందిరమ్మ కాలాన్ని ప్రచారంలో గుర్తుచేస్తున్నారు.

ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నకాలంలో తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉండేవో గుర్తుచేసుకుంటే ఒళ్లు జలదరిస్తుంది. ఇందిరమ్మ రాజ్యం అంటూ మళ్లీ ఆ రోజులను గుర్తుకుతెస్తే భయం వేస్తున్నది. 1966-77 వరకు, తిరిగి 1980-84 వరకు ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే 70-80ల కాలం నాటి రోజులను గుర్తుకు తెచ్చుకుంటే, తిరిగి ఆ కాలం రావడమంటే ఊహించుకుంటేనే భయం వేస్తుంది. దాదాపు 91లో వచ్చిన ఆర్థిక సంస్కరణల కాలం వరకు పేదరికంలో కొట్టుమిట్టాడింది దేశం.

ఇందిరాగాంధీ ఈ దేశ ప్రధానిగా ఉన్న కాలంలో ఉమ్మడి ఏపీలో రాజకీయ అస్థిరత రాజ్యమేలింది. ఏ ముఖ్యమంత్రిని ఏ రోజు ఇంటికి పంపిస్తారో తెలియదు. అలాంటి అరాచక పరిస్థితిలోనే సినీ నటుడు అయిన ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. ఎన్టీఆర్‌కు నటునిగా ఉన్న గ్లామర్‌తో పాటు అప్పటి రాజకీయ అరాచక పరిస్థితి ఆ పార్టీని గెలిపించాయి. ఆ రోజుల్లో నెలల తరబడి కర్ఫ్యూ విధించేవారు. దవాఖానలకు వెళ్లి ఏ మతం వాళ్లు ఎంతమంది మరణించారో లెక్కలు పెట్టుకోవడం వంటి రాక్షస చర్యలు మామూలే. రమీజాబీ ఉదంతంలో నగరం నెలల తరబడి కర్ఫ్యూలో మగ్గింది. కర్ఫ్యూలో పాఠశాలలు బంద్ కావడం, నెలల తరబడి ఇంటి వద్ద ఆడుకోవడం వంటి జ్ఞాపకాలు యాభై ఏండ్లు దాటినవారికి బాల్యం జ్ఞాపకాలుగా చెరగని ముద్ర వేయవచ్చు. కానీ, ఈ వయస్సులో నాటి భయానక పరిస్థితులను గుర్తుచేసుకుంటే ఒళ్లు జలదరిస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరంలో నివసించినవారు నాటి నరకాన్ని తప్పించుకొని ఎలా బయటపడ్డామా అనిపిస్తుంది.

ఒక్క శాంతిభద్రతలే కాదు, ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. వారానికి ఓ రోజు మంచినీళ్లు, నిత్యం విద్యుత్తు కోతలే. ఆవేశపరులైన యువత నక్సలిజాన్ని ఆశ్రయించిన కాలం ఇదే. సరిగ్గా ఈ సమయంలో వచ్చిన సినిమానే ఆకలిరాజ్యం. నిరుద్యోగ సమస్య యువతను నిర్వీర్యం చేసింది. నాటి యువత ఎలాంటి స్థితిలో ఉండేదో ఈ సినిమా అద్దం పట్టింది. ఆకలితో ఉన్న హీరో మోరలో పడ్డ ఆపిల్ తీసుకొని తింటాడు. ఆకలి తీర్చుకోవడానికి తాను ఎంతో ఇష్టపడే శ్రీశ్రీ పుస్తకాలను తూకంలో అమ్మేస్తాడు.

ఇప్పుడు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజ కంపెనీలను మనవాళ్లు ఏలేస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా ఐటీలో మనవాళ్లే. చివరికి రెండు వందల ఏండ్లపాటు మనల్ని పాలించిన బ్రిటన్‌ను పాలిస్తున్నది మనవాళ్లే. మన యువత ఇప్పుడు ప్రపంచాన్ని దున్నేస్తుంటే ఆకలి రాజ్యాన్ని గుర్తుజేసే ఇందిరమ్మ రాజ్యం తెస్తామనడం ఎన్నికల్లో వర్కవుట్ కాదు. 1969లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడితే వందల మందిని కాల్చిచంపి భయభ్రాంతులకు గురిచేసింది ఇందిరమ్మ రాజ్యం సాగుతున్న కాలంలోనే. నక్సలిజం, పేదరికం, కరువు, రాజకీయ అస్థిరత, కనీస వసతులు లేని జీవితం ఇదే కదా ఇందిరమ్మ కాలం నాటి జన జీవితం. ఇందిరమ్మ రాజ్యం సాగుతున్న కాలంలోనే ఎంకౌంటర్లలో వేలాదిమంది యువత బలయ్యారు. అలాంటి దయనీయమైన పరిస్థితులను గుర్తుకుతెచ్చే పాలనను తిరిగి తెస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పడం ఎలాంటి హామీనో. తెలంగాణ ఏర్పాటు తర్వాతనే తెలంగాణ గ్రామీణ జీవితం మెరుగుపడింది.

ఏ రాజకీయ పక్షమైనా తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశామో, అధికారం అప్పగిస్తే ఇంకా మెరుగ్గా ఏం చేస్తారో చెప్పాలి. ఏ పార్టీ అయినా చేసేది అదే. కానీ, రాష్ట్రం వేగంగా దూసుకువెళ్తూ ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలను ఆకర్షిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుతూ సంక్షేమ పథకాల అమల్లో, రైతుబంధు, ఇంటింటికి మంచినీళ్లు వంటి పథకాలతో దేశానికే దారి చూపుతుంటే ఆకలిరాజ్యం కాలం నాటి ఇందిరమ్మ రాజ్యం తెస్తామనడం సరైన వ్యూహం అనిపించుకోదు. ఇంతకన్నా ఏ రంగంలో ఇంకా మెరుగ్గా చేయగలరో చెప్పగలిగితే చెప్పాలి. దాని కోసం తమ వద్ద ఉన్న ప్రణాళికలు ఏమిటో ప్రజలకు చెప్పాలి. అంతే తప్ప పోరాడి సాధించుకున్న, కష్టపడి అభివృద్ధి చేసుకున్న తెలంగాణను పాత రోజుల్లోకి తీసుకువెళ్తామని చెప్పడం సరైన వ్యూహం కాదు.



నాడు 2006లో...

60 ఏండ్లలో అన్నీ ఇలాంటి కుతంత్రాలే!

ఇది 2006లో హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన మత కల్లోలాల దృశ్యం. చార్‌సౌ సాల్ షహర్ అయిన సౌభాగ్యనగరం 60 ఏండ్లలో అనుభవించిన వేదనను ఒక్క ఫొటోలో వర్ణించే సాదృశ్యమిది. దాదాపు 40 ఏండ్ల కాంగ్రెస్ దుష్పరిపాలనలో ఏకంగా 2,700 మత ఘర్షణలు జరిగాయి. ఆ తర్వాత తెలంగాణ ఏర్పడ్డాక, గత పదేండ్లలో,హైదరాబాద్‌లో ఒక్కటంటే ఒక్క మత కలహమూ చోటుచేసుకోలేదు. కారణం.. సీఎం కేసీఆర్! ఆయన అనుసరించిన పరిపాలన విధానం!

నేడు 2023లో...

10 ఏండ్లలో అన్నీ ఇటువంటి చిత్రాలే

ఇది హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిర్మిస్తున్న గూగుల్ ఆఫీసు. కాలిఫోర్నియాలోని హెడ్‌ఆఫీసు తర్వాత గూగుల్ సంస్థ అమెరికా వెలుపల నిర్మిస్తున్న అతిపెద్ద ఆఫీసు ఇదే. 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కడుతున్న ఈ అత్యాధునిక భవనం 2026 కల్లా పూర్తవుతుంది. దేశంలో ఇన్ని నగరాలున్నా గూగుల్ హైదరాబాద్‌నే ఎంచుకోవడానికి కారణం.. సీఎం కేసీఆర్! ఆయన రూపొందించిన పారిశ్రామిక విధానం!

ఈ పయనమిలా సాగకుంటే..?

తిగుళ్ల కృష్ణమూర్తి

...ఒక 70 ఏండ్ల నిజం, ఏడు పదుల హజం, నిలువెత్తు తెలంగాణ తేజం..

...ఎటువంటి తత్తరపాటు చూపకుండా, ఏ ఆర్భాటమూ చేయకుండా, ఎలాంటి హడావుడి పడకుండా, నలుగురిని వెంటేసుకొని, హెలికాప్టర్ ఎక్కుతూ, దిగుతూ, రోజుకు నాలుగు ఊర్లు తిరుగుతూ, చేతిలో నాలుగు కాగితాలు పట్టుకొని, నడుం మీద చెయ్యేసుకొని, నెమ్మదిగా వేదిక మెట్లనెక్కి, నిటారుగా మైకు ముందు నిలబడి, ఒక్కమాట పొల్లు పోకుండా, సొల్లు చెప్పకుండా, 'మనందరం పోరాడి తెలంగాణ తెచ్చుకున్నం. మీ కోసం నేను చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన. తెచ్చిన తెలంగాణను ఇట్ల అభివృద్ధి చేసిన. ఫలితాలు మీ కండ్ల ముందే ఉన్నయి. తెలంగాణ కోసం 24 ఏండ్లు నేను కొట్లాడిన. ఇక కొట్లాడి కాపాడుకోవాల్సింది మీరు. ఉంచుకుంటరా? పోగొట్టుకుంటరా? ఆలోచించి నిర్ణయించుకోండి!' అని సందేశమిస్తూ, ముందుకుసాగుతున్నరు. ముదిమిని లెక్క చేయకుండా.. వెలుగులీనుతున్న తెలంగాణను చూస్తూ, ముదముగా!

...ఎంత తేడా.. వారికి, ఆయనకు!

ఇంతకీ విమర్శకులు ఏమంటున్నారు? తెలంగాణలో అభివృద్ధి జరగలేదంటున్నారా? లేదు. కాళేశ్వరం కట్టలేదంటున్నారా? లేదు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయలేదంటున్నారా? లేదు. పొలాలకు నీళ్లు రాలేదంటున్నారా? లేదు. ఇంటికి, పంటకు, పరిశ్రమకు 24 గంటల కరెంటు ఇవ్వలేదంటున్నారా? లేదు. 3 కోట్ల టన్నుల ధాన్యం పండలేదంటున్నారా? లేదు. పండిన వడ్లన్నీ కొనలేదంటున్నారా? లేదు. ఇంటింటికీ మంచి నీళ్ల నల్లా పెట్టలేదంటున్నారా? లేదు. రోడ్లు బాగా లేవంటున్నారా? లేదు. కొత్త జిల్లాలు కాలేదంటున్నారా? లేదు. కొత్త మండలాలు ఏర్పడలేదంటున్నారా? లేదు. పింఛన్లు, సంక్షేమం పెరగలేదంటున్నారా? లేదు. హైదరాబాద్ అభివృద్ధి కాలేదంటున్నారా? లేదు. ఉద్యోగులకు దేశంలోనే భారీ జీతాలివ్వలేదంటున్నారా? లేదు. సచివాలయం కట్టలేదంటున్నారా? లేదు. ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం పెట్టలేదంటున్నారా? లేదు. అమరులకు అద్భుత స్తూప నివాళి అర్పించలేదంటున్నారా? లేదు. అనడం లేదు. అనలేరు కూడా. ఎందుకంటే ఇవన్నీ మన కండ్లముందు కనిపిస్తున్న వాస్తవాలు. కాదనలేని సత్యాలు. నికార్సయిన చెరపలేని నిత్యాలు. అందుకే ఏమంటున్నారు?

మన కండ్లకు కనబడని ఒక అసత్యానికి, అందమైన మాటల ప్యాకింగ్ చేసి, అద్దాల తెరపైకి పంపి మన మెదడులో చొప్పించి, మాయజేసే, మసిబూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేస్తున్నరు. అదే ఆత్మగౌరవం, దొరతనం! కండ్ల ముందు కనిపించే వాటిని కాదనలేక, కనిపించని దానితో కనికట్టు చేసే ఎత్తుగడ ఇది. మన వేలితో మన కన్నే పొడిపించే సీమాంధ్ర వలస పాలకుల వ్యూహమే ఇది.

ఎవరి దొరతనం.. ఎక్కడి దొరతనం?

- ఈ కేసీఆరే కదా.. 24 ఏండ్ల కిందట పదవిని సైతం వదిలిపెట్టి తెలంగాణ జెండా ఎత్తుకున్నది!
- ఈ కేసీఆరే కదా.. సకల భేషజాలూ పక్కకుపెట్టి తన ప్రాంతం కోసం ఉద్యమ సమరాంగణంలోకి దూకింది!
- ఈ కేసీఆరే కదా.. తన ప్రజల కష్టాలను చూడలేక చావునోట్లో తలపెట్టింది!
- ఈ కేసీఆరే కదా... ప్రత్యేక రాష్ట్రం కోసం 13 ఏండ్ల పాటు నానా అషాఢ భూతులనూ ఆలింగనం చేసుకున్నది!
- ఈ కేసీఆరే కదా.. ఉద్యమ ఫలితం కోసం అన్ని పదవులనూ అనేకసార్లు తృణప్రాయంగా వదులుకున్నది!
- ఈ కేసీఆరే కదా... తెలంగాణ కోసం దేశంలోని 33 పార్టీల గడప తొక్కి తెలంగాణకు మద్దతు కూడగట్టింది!
- ఈ కేసీఆరే కదా... జేఏసీ ఏర్పాటు కోసం హోదా వదిలి జానారెడ్డి ఇంటికి సైతం వెళ్లి ఒప్పించింది!
- ఈ కేసీఆరే కదా...ఉన్న తెలంగాణను ఊడగొట్టిన మోసాల కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ తెచ్చింది!
- ఈ కేసీఆరే కదా...కాళేశ్వరానికి ఒప్పందం కోసం మహారాష్ట్ర దాకా వెళ్లి చర్చలు జరిపింది!
- ఈ కేసీఆరే కదా... తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో ఆరేండ్ల పాటు రాజీ పడింది!

కేసీఆర్‌కు దొరతనమే ఉంటే, ప్రాంతం కోసం, ప్రజల కోసం ఇంతలా తగ్గేవాడా? తగ్గినెగ్గేవాడా? జరిగేదేనా? తెలంగాణలో నాటి నుంచి నేటిదాకా కేసీఆర్‌లాగా, జనంలో తిరిగి, జనంతో గడిపిన ఒక నాయకుడి పేరు చెప్పగలరా?

'ఉద్యమంలో రాజీపడితే రాళ్లతో కొట్టండి, తెలంగాణ కోసం గొంగళి పురుగునైనా కావలించుకుంటా, 24 గంటల కరెంటివ్వకపోతే దేనికైనా సిద్ధం, ఇంటింటికీ నీళ్లివ్వకపోతే ఓటే అడగను అన్నవాడు' దొర అయితడా? భూమి పుత్రుడు అయితడా? దొరతనమే ఇష్టమనుకుంటే, మొదట్లో చంద్రబాబుతో రాజీపడినా, 13 ఏండ్ల ఉద్యమంలో ఒక్కరోజు కాంగ్రెస్‌తో రాజీపడినా, అద్భుతమైన దొరతనమే (పదవీ వైభోగం) దక్కేది కదా! ఈ కష్టాలన్నీ ఎందుకు? అయినా కేసీఆర్ ఒక్కడేనా? మిగిలిన అన్నిపార్టీల సారథులూ అగ్రకులాల వాళ్లే కదా? వాళ్లు దొరలు కాదా?

- ఇక ప్రతిపక్షాలు చెప్తున్న ఆత్మగౌరవానికి అర్థం ఏమిటి? పొలాలకు నీళ్లు లేకుండా, తాగడానికి మంచి నీళ్లు లేకుండా, చేయడానికి పనిలేకుండా, తినడానికి తిండి లేకుండా, చేతిలో పైస లేకుండా, ఊరు ఊరే వల్లకాడై, చాతనైన ప్రతి ఒక్కడూ దుబాయికో, ముంబాయికో, బొగ్గుబాయికో వలసపోయి, బతుకులు పండిపోయి, డొక్కలెండిపోయిన కాంగ్రెస్ పాలన **ఆత్మగౌరవ పాలనా?**
- ఢిల్లీ సుల్తాన్ల ముందు తలవంచుకొని, చేతులు కట్టుకుని జీ హుజూర్ అంటూ కప్పం గట్టడం ఆత్మగౌరవ పాలనా? లేక మన నాయకుడితో మనం కోనాయ్ అన్న ప్రశ్న లేకుండా బతికే పరిస్థితి **ఆత్మగౌరవమా?**
- మన కాళ్ల మీద మనం నిలబడటం ఆత్మగౌరవమా? వేరే నేతల చెప్పులు మోయడం **ఆత్మగౌరవమా?**
- 'మీకు మేం తెలంగాణ ఇచ్చినం' అని బిచ్చమేసినట్టు కాంగ్రెస్ చెప్తే ఆత్మగౌరవంగా ఉందా? 'మన మందరం కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నం' అంటే **ఆత్మగౌరవంగా ఉందా?**
- 'మీకు తెలంగాణ ఇచ్చినందుకు నాకు అధికారమివ్వండి' అనడం ఆత్మగౌరవంగా ఉందా? 'మనం తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసిన. మీరు కాదంటే విశ్రాంతి తీసుకుంటా' అనడం ఆత్మగౌరవంగా ఉందా? **ఏది ఆత్మగౌరవం?**

కేసీఆర్ అంటేనే.. నిలువెత్తు తెలంగాణ ఆత్మగౌరవం కదా!

మనం, మనందరం, తెలంగాణ వాసులందరం కలిసి కేసీఆర్‌ను కాపాడుకోకపోతే, పాలనలో కంటిన్యుటీ లేకపోతే, పట్టాలెక్కిన ప్రగతి ఇలాగే కొనసాగకపోతే, పైన కనిపిస్తున్న రెండు ఫొటోల్లో రెండో ఫొటో ఉండదు. మొదటి ఫొటోనే మొత్తం తెలంగాణను ఆక్రమిస్తుంది.

తస్మాత్ జాగ్రత్త!

అయినా ఆత్మగౌరవం మనకే ఉంటదా? కేసీఆర్‌కు ఉండదా? ఫామ్‌హౌజ్‌లో పండుకుంటడన్నది మొదలుకొని ఆయనపై ఇప్పటికి వేయని ముద్ర లేదు. చేయని విమర్శ లేదు. అయినా మనకోసం ఆయన వాటన్నింటిని భరించలేదా? ఆయనలోనో, ఆయన పార్టీలోనో ఒకటో రెండో లోటుపాట్లుంటే మనం భరించలేమా? భరిస్తే తప్పేమిటి? కండ్లముందు కనిపిస్తున్న అభివృద్ధిని ఒప్పుకోక తప్పని పరిస్థితిలో, అభివృద్ధి చేసిండు అంటూనే, మరో రకం మాయలు చేసి మనల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నరు. ఇది కేసీఆర్‌పై జరుగుతున్న కుట్ర కాదు. మొత్తం తెలంగాణపై జరుగుతున్న కుట్ర. అన్ని రాష్ట్రాలనూ దాటిపోతున్న తెలంగాణను అడ్డుకోవడానికి, అందరూ కూడబలుక్కుని పన్నిన కుతంత్రం. ఉద్యమ సమయంలోనూ ఇలాంటి ప్రచార కుట్రలే జరిగాయి. వాటికి లొంగిపోయి ఉంటే తెలంగాణ వచ్చేదే కాదు. అప్పట్లాగే ఇప్పుడూ తెలంగాణ ఒక్కుమ్మడిగా ఈ కుట్రలను తిప్పికొట్టాలి.

ఇది సెల్‌ఫోన్‌ను స్విచాఫ్ చేసి, మన మెదడును స్విచాన్ చేయాల్సిన సమయం. ఇది గతకాలపు కష్టాలను, మనకాలపు సౌకర్యాలను బేరీజు వేసి చూసుకోవాల్సిన సమయం. ఇది మనసుతో కాదు; బుద్ధితో ఆలోచించాల్సిన సమయం. ఉద్వేగంతో కాదు; ఉద్యమస్ఫూర్తితో యోచించాల్సిన సమయం. ఇది చెవులతో విని నిర్ణయించుకోవాల్సిన సమయం కాదు; కండ్లతో చూసి నిర్ధారించుకోవాల్సిన సమయం. ఎవడో చూపించింది కాదు; మనకై మనం పోల్చుకొని చూడాల్సిన సమయం.

ప్రచారం అబద్ధం. ఎన్నిక నిజం. మాట అబద్ధం. ఓటు నిజం. అబద్ధాల ప్రచారానికి లొంగిపోయి, నిజమైన ఎన్నికల్లో తప్పు చేస్తే, పరిస్థితి తారుమారవుతుంది.

6 గ్యారెంటీల కోసమే రాచకొండ రైతు భూముల బేరం అన్నవాళ్లు, అడ్డగోలు హామీల కోసం తెలంగాణనే అమ్మకానికి పెడతారు. రూ. 3.5 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న కర్ణాటకలో 5 గ్యారెంటీలనే అమలు చేయలేనప్పుడు, రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్ మాత్రమే ఉన్న తెలంగాణలో 6 గ్యారెంటీలను, 42 పేజీల హామీలను ఎలా అమలుచేస్తరు?

ఇప్పుడు రెవెన్యూ రివర్స్, ఉచిత కరెంటు రివర్స్ అంటున్నవాళ్లు రేపు తెలంగాణ రివర్స్ అంటరు. అప్పుడు రెడ్డొచ్చె మొదలాయె అన్నట్టు కథ మొదటికి వస్తుంది. ఏడాదికో ముఖ్యమంత్రి పారాడుకుంటూ వస్తడు.

అందుకోసం మన సొమ్ము ఢిల్లీకి కప్పమై పోవచ్చు. మన పొల్లగాడి బతుకు కత్తిపోటై కడతేరవచ్చు. మన హైదరాబాద్‌లో కంపెనీలకు బదులు కల్లోలం- కర్ఫ్యూ కనిపించవచ్చు. ఇది వరకిదే కదా జరిగింది! మాయాబజార్‌లో పింగళి అన్నట్టు 'పెండ్లి చేయడమంటే కష్టంగానీ చెడగొట్టడం చిటికెలో పని'!

ఈనగాచి నక్కల పాలు జేస్కుంటమా? చరిత్రలో ఎన్నడూలేని రీతిలో తెలంగాణ గత పదేండ్లుగా వెలుగులు విరజిమ్ముతున్నది. మంచిగున్నదాన్ని ఉంచుకోవడమా, పోగొట్టుకోవడమా అన్నది మన చేతిలోనే ఉన్నది.

ఒక్క చాన్స్ ప్లీజ్ అనడానికి ఇదేమైనా ఖడ్గం సినిమానా? మార్పు కావాలని అమ్మను మార్చుకుంటమా? మార్పు చూడాలని నాన్నను మార్చుకుంటమా? మార్పే ముఖ్యమనుకుంటే అన్నీ మారిపోతయ్...

7 ఏండ్లుగా మలయాళీలు విజయన్‌ను కాపాడుకుంటున్నట్టు, 12 ఏండ్లుగా బెంగాలీలు మమతా బెనర్జీని కాపాడుకుంటున్నట్టు, 20 ఏండ్లుగా టర్కీ జనం ఎర్డోగాన్‌ను కాపాడుకున్నట్టు, 23 ఏండ్లుగా ఒడిషా వాసులు నవీన్ పట్నాయక్‌ను కాపాడుకున్నట్టు, 56 ఏండ్లుగా తమిళనాడు ప్రజలు ద్రవిడ పార్టీలను కాపాడుకుంటున్నట్టు, 74 ఏండ్లుగా చైనా ప్రజలు కమ్యూనిస్టు పార్టీని కాపాడుకుంటున్నట్టు... మనం మనకోసం కాపాడుకోవాలి కేసీఆర్‌ను. కేసీఆర్‌తోనే తెలంగాణ బాగైంది. తెలంగాణ బాగుండాలంటే కేసీఆర్ బాగుండాలె!